సాక్షి కర్నూలు
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



కేసీకి 1,255 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 1,255 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో ప్రస్తుతం 0.917 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అలరించిన నృత్యాలు

శ్రీశైలం టెంపుల్: శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కళారాధన వేదికపై గురువారం నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,610.85
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:39.271
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,252

న్యూస్‌రీల్

108 వాహనాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న డాక్టర్ రఘు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని 108 అంబులెన్స్ వాహనాల్లో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘుకు బాధ్యతలు అప్పగించారు. రెండు నెలల నుంచి ఆయన జిల్లాలోని 108 అంబులెన్స్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 25 వాహనాల్లో తనిఖీలు చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చారు. నివేదికలో ఉన్న సమస్యలు, లోపాలను సరిచేసేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు.

'జగనన్న గోరుముద్ద'లో రాగి జావ

- మార్చి 2 నుంచి అమలు

కర్నూలు(సెంట్రల్): జగనన్న గోరుముద్దలో బెల్లం, రాగితో తయారు చేసిన జావను మార్చి 2 నుంచి ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఇచ్చేందుకు మెనూలో మార్పులు చేయాలని అధికారులను సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనతతో బాధపడే బాలింతలు, గర్భవతుల వివరాలు ఏఎన్ఎంల ద్వారా సర్వే చేయించాలన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రేరీల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, సీపీఓ అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణానికి 190 ప్రత్యేక బస్సులు

కర్నూలు(రాజ్‌విహార్): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి వెళ్లిన భక్తులు తిరిగి వచ్చేందుకు 190 బస్సులు ఏర్పాటు చేసినట్లు ప్రజా రవాణా శాఖ కర్నూలు జిల్లా అధికారి టి. వెంకటరామం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు 1 డిపో నుంచి 60, ఆదోని- 37, కర్నూలు 2డిపో- 39, ఎమ్మిగనూరు డిపో నుంచి 54 బస్సులు పంపుతామని పేర్కొన్నారు. శనివారం పండుగ తరువాత ఇవి భక్తులను గమ్యస్థానాలకు చేర్చుతాయని తెలిపారు. ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఇతర జిల్లాల నుంచి 170 బస్సులు తెప్పించామని పేర్కొన్నారు.

నేడు పర్యావరణ విద్య పరీక్ష

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర విద్యార్థులకు నేడు(శుక్రవారం)పర్యావరణ విద్య పరీక్షను నిర్వహించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 306 కాలేజీల్లో నిర్వహించే ఈ పరీక్షకు 33 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష జరిగిన రోజునే సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులు వేయనున్నారు. మొత్తం 100 మార్కులకు గాను, 60 మార్కులు థియరీకి, 40 మార్కులు ప్రాజెక్టుకు కేటాయించారు.

'పది' పరీక్షలకు 149 కేంద్రాలు

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 149 కేంద్రాలను పరీక్షల విభాగం అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రెగ్యులర్ టెన్త్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఓపెన్ స్కూల్ టెన్త్, ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. రెగ్యులర్ విద్యార్థులు 31,766 మంది, ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులు 3 వేల మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

పగలు భగభగ.. రాత్రి గజగజ

- ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండే ప్రమాదం
- హెచ్చరించిన వాతావరణ శాస్త్రవేత్తలు

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణంలో భిన్న మార్పులు చోటుచేసుకున్నాయి. పగలంతా ఎండలు దంచికొడుతుండగా రాత్రి చలి గజగజ వణికిస్తోంది. దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పుదిశలో గాలులు వీస్తున్నాయి. దీంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ సమయంలో 33 నుంచి 34 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సి ఉంది. అయితే 37 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు ఉన్నట్టుండి సాధారణం కంటే 2 డిగ్రీల వరకు తక్కువకు పడిపోతున్నాయి. ఈ సమయంలో 19 నుంచి 20 డిగ్రీల స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉంటాయి. అయితే కొన్ని రోజులుగా 15 నుంచి 17 డిగ్రీల వరకే నమోదవుతున్నాయి. తెల్లవారు జామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. పగటి ఉష్ణోగ్రతలు ఈ నెల 9న కౌతాళం మండలంలోని తావిలో 35.5, హొళగుంద మండలం సులువాయిలో 35.4, ఈ నెల 15న ఎమ్మిగనూరులో 36.7, ఓర్వకల్లు మండలం నన్నూరులో 36.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఈ నెల 9న రాత్రి ఉష్ణోగ్రతలు మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలో 16.9, తుగ్గలి మండలం జొన్నగిరిలో 16.8, ఈ నెల 15న తుగ్గలిలో 14.9, కౌతాళం మండలం హాల్వీలో 15.2 డిగ్రీలు నమోదయ్యాయి. ఈ నెల 9వ తేదీతో పోలిస్తే పగటి ఉష్ణోగ్రతలు పెరుగగా, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గినట్లు స్పష్టమవుతోంది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు. ఎల్‌నినో (పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్య రేఖ చుట్టుపక్కల ఉపరితల ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం) ప్రభావంతో వేసవి భగభగ మండే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు.



ఈ నెల 9 నుంచి ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి

తేదీ	గరిష్ట ఉష్ణోగ్రతలు	కనిష్ట ఉష్ణోగ్రతలు
ఫిబ్రవరి 9	35.4	17.4
10	35.9	17.8
11	36.8	16.8
12	37.9	16.8
13	36.9	16.5
14	36.0	15.8
15	36.7	15.9



భ్రామరీ సమేత మల్లికార్జునుడికి విశేష పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు



శిఖరం నుంచి శ్రీశైలాలయాన్ని దర్శించుకుంటూ..



నల్లమల మీదుగా తరలివస్తున్న పాదయాత్ర భక్తులు

నీలకంధరా దేవా!

- శ్రీగిరిలో మిన్నంటిన బ్రహ్మోత్సవ వైభవం
- నల్లమలలో ప్రతిధ్వనిస్తున్న ఓంకార నాదం
- పాతాళగంగలో పోటెత్తిన భక్తజనం
- పుష్పపల్లకీలో విహరించిన భ్రామరీ సమేత మల్లన్న



పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

అదిగదిగో శ్రీశైలం.. భూలోకాన కైలాసం అంటూ భక్తజనం మల్లన్న ఎదుట ప్రణమిల్లుతోంది. శ్రీశైలవాసా.. శరణు మల్లన్న అంటూ నీరాజనం పడుతున్నారు. నల్లమల అభయారణ్యం మీదుగా పగలు, రేయి చిన్నాపెద్దా తేడా లేకుండా పాదయాత్రగా వచ్చే శివభక్త గణం ఎండలు మండుతున్నా.. చల్లని గాలులు వణికిస్తున్నా.. భక్తిభావం తొణకడం లేదు. అడుగులన్నీ శ్రీగిరి వైపు పడుతున్నాయి. కైలాస ద్వారం చేరుకుని మరింత ఉత్సాహంతో మల్లికార్జునుడి దర్శనానికి బారులుదీరుతున్నారు. బ్రహ్మోత్సవ సందడి అంబరాన్ని తాకుతుండగా.. భక్తజనం పులకించిపోతుంది.

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైలంలో దేవదేవుళ్లు పూలపల్లకీపై విహరించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేళ భక్తజనం ఆనంద పరవశులై స్వామిఅమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆరవ రోజు గురువారం నిర్వహించిన మల్లన్న పుష్పపల్లకీ సేవ దివ్య పరిమళభరితంగా సాగింది. ఆలయ తూర్పు, దక్షిణ మాడవీధుల్లో జరిగిన ఈ కార్యక్రమంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. సుగంధ పుష్పాలతో అలంకరించిన పల్లకీలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. పల్లకీలో స్వామి ఊరేగుతున్నంత సేపు అశేష భక్తజనవాహిని కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. గంగాధర మండపం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం నంది మండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం మీదుగా రాజగోపురం వరకు సాగింది. జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, డ్రమ్స్, డప్పులు, తప్పెట్లు, మేళతాళాలు, భజంత్రీలు, శంఖానాదాల కోలాహలం నడుమ గ్రామోత్సవం నేత్రానందభరితంగా సాగింది. కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ఈవో ఎస్.లవన్న దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు డాక్టర్.కనకదుర్గ, అంబాల లక్ష్మీ సావిత్రమ్మ, ఎం.విజయలక్ష్మి, మఠం విరుపాక్షయ్య స్వామి, ఓ.మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలం నేడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శుక్రవారం సాయంత్రం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు గజవాహనసేవ, గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.



పుష్ప పల్లకీ సేవను ప్రారంభిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ఈవో ఎస్.లవన్న దంపతులు తదితరులు

శ్రీశైలం భక్తజన సంద్రం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన భక్తులతో శ్రీగిరి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. వేకువజామున్నే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, కృష్ణవేణమ్మకు ప్రత్యేక హారతులిచ్చారు. అనంతరం మల్లన్న దర్శనానికి బారులుదీరుతున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనానికి అనుమతిస్తున్నారు. భక్తులందరికీ స్వామివారి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అందరికీ అలంకార దర్శనాన్ని కల్పిస్తున్నారు. మల్లికార్జున స్వామి గర్భాలయంలో కూడా నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేసి త్వరితగతిన భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తున్నారు. ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురం నుంచి ప్రారంభమైన పాదయాత్ర భక్తులు నల్లమల అడవుల్లో నాగలూటి, పెచ్చెర్వు, కైలాసద్వారం, సాక్షిగణపతి మీదుగా శ్రీశైలం చేరుకుంటున్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన కొర్రప్రోలూరు శివస్వాములు 20 కి.మీ దూరంలోని ఆత్మకూరు డివిజన్‌లోని రోళ్ల పెంట చేరుకుని అక్కడ నుంచి నేరుగా పెచ్చెర్వుకు చేరుకుంటున్నారు. అనంతరం భీముని కొలను మీదుగా శ్రీశైల క్షేత్రానికి నడకమార్గంలో మల్లన్న దర్శనానికి తరలి వస్తున్నారు.



గ్రామోత్సవంలో భక్తుల కోలాహలం

భక్తులకు ఏ లోటు రానీయొద్దు

ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి లోటు రానీయొద్దని దేవస్థానం అధికారులను ఈఓ లవన్న ఆదేశించారు. గురువారం ఆయన క్షేత్ర పరిధిలో తాత్కాలిక వైద్యశాల, అన్న ప్రసాదవితరణ, దర్శన క్యూలైన్లను పరిశీలించారు. క్షేత్ర పరిధిలో వైద్య శిబిరాల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలన్నారు. లడ్డూ ప్రసాదాల కేంద్రాల వద్ద భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమయానుసారంగా అన్నప్రసాదాలను అందించాలని సూచించారు. క్యూలైన్లలో ఎటువంటి తొక్కిసలాట లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. క్యూ కాంప్లెక్స్‌లో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులకు నిరంతరం అల్పాహారం, మంచినీరు, బిస్కెట్లు అందించాలని సూచించారు.

మేము.. మీకు సహాయ పడగలము!

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో నందికూడలి వద్ద సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో క్షేత్రానికి సంబంధించిన వివరాలతో కరపత్రాలు అందుబాటులో ఉంచారు. భక్తులు ఏదేనీ సమాచారాన్ని అడిగిన వెంటనే మర్యాదపూర్వకంగా వారికి తెలియజేస్తున్నారు.

రథశిఖర కలశానికి పూజలు

ఆదివారం రథోత్సవం సందర్భంగా రథశిఖర కలశానికి గురువారం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈఓ లవన్న ప్రత్యేక పూజల నిర్వహించి, రథశిఖర కలశాన్ని స్వయంగా మోసుకుంటూ ఆలయప్రదక్షిణ చేశారు. అనంతరం రథశిఖర కలశాన్ని సంప్రదాయబద్ధంగా రథం వద్దకు చేర్చారు.



అన్నప్రసాద వితరణ భవనంలో వంటలను పరిశీలిస్తున్న ఈఓ లవన్న



రథశిఖరంతో ఆలయప్రదక్షిణ చేస్తున్న ఈఓ



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రవీంద్రారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి

తొలి రోజు రెండు నామినేషన్లు

- పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ఘట్టం ప్రారంభం

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల తొలి అంకం నామినేషన్ ఘట్టం గురువారం ప్రారంభమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ఈనెల 23 వరకు ఉంటుందన్నారు. 24న పరిశీలన నిర్వహిస్తారన్నారు. ఉపసంహరణకు 27 వరకూ అవకాశముంటుందన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల దాఖలు..

తొలి రోజున రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఎం.వి.రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీకి వెన్నపూస రవీంద్రారెడ్డి నామినేషన్ వేశారు. ఆర్‌ఓకు ఆయన చాంబర్‌లో నామినేషన్ పత్రాలను అందజేశారు. ఒక సెట్ నామినేషన్ వేసిన ఇరువురు అభ్యర్థులు రెండో సెట్‌ను ఈనెల 22న దాఖలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం విలేకరులతో ఎమ్మెల్సీ అభ్యర్థులు మాట్లాడారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ..

కర్నూలు(సెంట్రల్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు మొదటి రోజు గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ల స్వీకరణకు ఆర్‌ఓ కార్యాలయంలో అధికారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వేచి ఉన్నారు. అయినా ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్ వేయడానికి రాలేదు. ఈనెల 23వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వీలు కల్పించింది.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ కేతన్‌గార్గ్‌కు అందజేస్తున్న రామచంద్రారెడ్డి

క్లుప్తంగా

అగ్రి ల్యాబ్‌ల తనిఖీలకు డీడీఏ

కర్నూలు(అగ్రికల్చర్): నియోజకవర్గాల వారీగా నెలకొల్పిన డాక్టర్ వైఎస్‌ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లను తనిఖీ చేసేందుకు తిరుపతిలోని రీజినల్ కోడింగ్ సెంటరు డీడీఏ మల్లికార్జునయ్యను నియమించారు. ల్యాబ్‌ల పనితీరు ఎలా ఉంది.. ఇంకా ఎటువంటి మార్పులు చేయాలి.. ల్యాబ్‌ల ఏర్పాటు ఉద్దేశం నెరవేరుతోందా...తదితర వాటిని ఆయన పరిశీలించనున్నారు. గురువారం ఆయన నంద్యాల జిల్లాలోని ల్యాబ్‌లను తనిఖీ చేశారు. శుక్రవారం కర్నూలు జిల్లాలోని ల్యాబ్‌లను తనిఖీ చేస్తారని వ్యవసాయ అధికారులు తెలిపారు.

మృతుడు గుంతకల్లు వాసి



నూర్ మహమ్మద్ (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం సమీపంలో బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడు గుంతకల్లు పట్టణానికి చెందిన నూర్ మహమ్మద్ అని రైల్వే పోలీసులు గుర్తించారు. జీఆర్‌పీఎస్(గుంతకల్లు రైల్వే పోలీస్‌స్టేషన్) ఎస్‌ఐ వెంకటరమణ గురువారం వివరాలను విలేకరులకు వెల్లడించారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన నూర్ అహమ్మద్ బీఏ బీఈడీ చదివి స్థానిక పల్లవి పాఠశాలలో ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. చాలీ చాలనీ జీతంతో జీవితం ఎలా గడుస్తుందని మధనపడేవాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు.

కెనరా బ్యాంక్ మెగా రిటైల్ ఎక్స్‌పో



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కెనరా బ్యాంక్ రీజనల్ ఇన్‌చార్జి కె.మహంతి

కర్నూలు(అర్బన్) : కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లాపరిషత్ సమావేశ భవనంలో గురువారం మెగా రిటైల్ ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కెనరా బ్యాంక్ రీజనల్ ఇన్‌చార్జి కె.మహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎక్స్‌పోలో నగరంలోని ప్రాముఖ్యత కలిగిన 14 మంది బిల్డర్స్, 8 కార్ల కంపెనీలకు సంబంధించిన డీలర్లు హాజరై వారి ఉత్పత్తులను వివరించారన్నారు. ఈ ఎక్స్‌పోను పెద్ద సంఖ్యలో సందర్శించారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే రూ.16.64 కోట్ల రుణాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించామన్నారు. అలాగే దాదాపు రూ.2.60 కోట్లకు సంబంధించిన రుణాల చెక్కులను కస్టమర్లకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైల్ హబ్ డివిజనల్ మేనేజర్ కృష్ణచైతన్యరెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వై.వెంకటనారాయణ, డివిజనల్ మేనేజర్ అచ్చారావు, బుధవారపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆదోని రూరల్: మండలంలోని హాన్వాల్ గ్రామానికి చెందిన శంకరప్ప(35) అనే వ్యక్తి గురువారం ఉదయం పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నేళ్లుగా తీవ్రమైన కడుపునొప్పి ఉడటం, ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య లక్ష్మి తెలిపారు.

శివ పూజకు వేళాయె!

- జిల్లాలో పురాతన శివాలయాలు
- శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు
- దర్శించుకోనున్న భక్తులు



నల్లమల అభయారణ్యంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. శివరాత్రి పర్వదినం సమీపిస్తుండగా పురాతన శైవ క్షేత్రాల్లో పూజలు మొదలయ్యాయి. భక్తకోటి పరమేశ్వరుడి ఆరాధనలో తరిస్తోంది. ఎత్తైన పచ్చని కొండల్లో పలు రూపాల్లో కొలువైన శివయ్యను దర్శించుకునేందుకు భక్తజనం తరలివస్తోంది. ఇప్పటికే శ్రీశైలం, మహానంది, ఓంకారం, సంగమేశ్వరం తదితర క్షేత్రాలకు భక్తుల తాకిడి మొదలైంది. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం వచ్చిన భక్తులు నల్లమలలోని శైవ క్షేత్రాలను దర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా క్షేత్రాల విశిష్టతపై ప్రత్యేక కథనం. – ఆత్మకూరు



శ్రీశైలం

భూ మండలానికే నాభిస్థానంగా పేర్కొంటున్న శ్రీశైల మహాక్షేత్రం ఇల కైలాసంగా విరాజిల్లుతోంది. ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలిసి వెలసిన క్షేత్రం ఇది. శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లు కొలువై భక్తుల చేత పూజలందుకుంటున్నారు. ఇతిహాసాలు, పురాణాల్లో ఈ క్షేత్రం ప్రస్తావన ఉంది.

దర్శన ఫలం : ఈ క్షేత్ర సమీపంలో ఉన్న శిఖరేశ్వరం వద్ద నంది కొమ్ముల నుంచి శ్రీశైల శిఖరాన్ని దర్శిస్తే పునర్జన్మ ఉండదని, మల్లికార్జునస్వామిని స్పర్శ దర్శనం చేసుకుంటే ఆత్మ పరిపూర్ణత సాధిస్తుందని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి: ఆత్మకూరు నుంచి దోర్నాల మీదుగా 110 కి.మీ. దూరం రోడ్డు మార్గంలో ప్రయాణించి శ్రీశైలం చేరుకోవచ్చు. శివ భక్తులు కార్తీక మాసం, శివరాత్రి, ఉగాది పర్వదినాల్లో ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురం నుంచి నల్లమల అభయారణ్యంలో 45 కి.మీ పాదయాత్రగా శ్రీశైలక్షేత్రానికి చేరుకుంటారు.

మహానంది



నవ నందుల క్షేత్రాల్లో మహానందికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. ఇక్కడ మహానందీశ్వర స్వామి కొలువుదీరాడు. ఆలయ శిల్ప కళ భక్తులను ఆశ్చర్యపరుస్తోంది. క్షేత్రంలోని మూడు కోనేరులలో నీరు ఎంతో స్వచ్ఛంగా ఉండి నిరంతరం ప్రవహిస్తోంది. ఇక్కడి జల సంపదతో చుట్టు పక్కల వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండటం విశేషం.

పుణ్యఫలం

మహానందీశ్వరస్వామిని దర్శిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి

జిల్లా కేంద్రం నంద్యాల నుంచి 25 కి.మీ దూరం, ఆత్మకూరు నుంచి 60 కి.మీ దూరం ఉంది. గుంటూరు – నంద్యాల రైలు మార్గంలో గాజులపల్లె రైల్వే స్టేషన్ చేరుకుని అక్కడి నుంచి ప్రైవేటు వాహనాల్లో క్షేత్రానికి చేరుకోవచ్చు. బెంగళూరు, వైజాగ్, చెన్నై నుంచి ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి 75 కి.మీ దూరంలోని మహానందికి చేరుకోవచ్చు.

గుండ్ల బ్రహ్మేశ్వరం



నల్లమల అటవీ అందాల మధ్య గుండ్లకమ్మ నది చెంతన గుండ్లబ్రహ్మేశ్వర క్షేత్రం వెలసింది. ఈ క్షేత్రంలో గుండ్లబ్రహ్మేశ్వరస్వామి, పార్వతీదేవి వెలిశారు. మహాశివరాత్రి పర్వదినాన మాత్రమే భక్తుల దర్శనానికి అనుమతి ఉంది. మిగిలిన రోజుల్లో ఈ క్షేత్రానికి భక్తులు వెళ్లే అవకాశం లేదు.

దర్శన ఫలం

ఇక్కడ వెలసిన గుండ్ల బ్రహ్మేశ్వరుడిని దర్శిస్తే మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. నల్లమల అందాలతో పాటు బ్రిటీషుల కాలం నాటి టేకు వృక్షాలు, అరుదైన వృక్ష సంపద, అటవీ జంతువులను చూసే అవకాశం ఉంది.

ఇలా చేరుకోవాలి

ఈ క్షేత్రానికి బండిఆత్మకూరు మండలం సంతజూటూరు మీదుగా అటవీ మార్గంలో 18 కి.మీ ప్రయాణించాలి. శివరాత్రి రోజు భక్తులు అధిక సంఖ్యలో ట్రాక్టర్లలో చేరుకుంటారు. అటవీ శాఖ అధికారుల అనుమతితో కార్లు, జీపులలో వెళ్లాలి.

కొలనుభారతి క్షేత్రం



ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రెండో సరస్వతి నిలయంగా కొలనుభారతి క్షేత్రం విరాజిల్లుతోంది. ఏటా వసంతి పంచమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ క్షేత్ర పరిధిలో జనమేజయ మహారాజు ఇక్కడ తపస్సు ఆచరించి సరస్వతి దేవి అనుగ్రహం పొందినట్లు పురాణాల్లో ఉంది. సమీపంలో సప్త ఆలయాలు ఆకట్టుకుంటున్నాయి.


దర్శన ఫలం

ఈ క్షేత్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తే విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి

ఈ క్షేత్రం కర్నూలు నుంచి 80 కి.మీ, ఆత్మకూరు నుంచి 23 కి.మీ దూరంలో ఉంది. అన్ని వాహనాల ద్వారా ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు.

యాగంటి



అందమైన ప్రకృతి ఒడిలో వెలిసిన యాగంటి క్షేత్రం ఎన్నో విశేషాలకు నిలయం. ఉమా సమేత మహేశ్వరుడు ఒకే లింగంలో వెలిసి భక్తుల చేత పూజలందుకుంటున్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన వెంకటేశ్వర స్వామి గుహలు అద్భుతంగా ఉన్నాయి. కలియుగాంతానికి సంకేతంగా ఆలయంలోని నందిరంకె వేస్తుందని చెప్పుకుంటారు.

దర్శన ఫలం

యాగంటి క్షేత్రంలో వెలిసిన ఉమామహేశ్వరుడిని దర్శించుకుంటే సర్వపాప హరణం కలుగుతుందని, స్థానిక అగస్త్య పుష్కరిణిలో నీటికి ఔషధ గుణాలు ఉన్నాయని, ఇందులో స్నానం ఆచరిస్తే సర్వ రోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి

కర్నూలుకు వంద కిలోమీటర్లు, నంద్యాలకు 60 కి.మీ దూరంలో యాగంటి ఉంది. ముందుగా ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు, రైలు మార్గంలో బనగానపల్లెకు చేరుకోవచ్చు. ఇక్కడి నుంచి 11 కి.మీ దూరంలో ఉన్న క్షేత్రానికి ఆటోలు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. శివరాత్రికి ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు నడుపుతారు.



సంగమేశ్వర క్షేత్రం

కృష్ణానది చెంత సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలిసిన సంగమేశ్వరక్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ ఆలయాన్ని త్రేతాయుగంలో నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. సంగమేశ్వరుడు వేపధారణ లింగరూపంలో వెలిశారు. శ్రీశైలం రిజర్వాయర్ నిర్మాణంతో ఈ ఆలయం ఏడాదిలో 8 నెలలు కృష్ణమ్మ ఒడిలో ఉండి, నాలుగు నెలలు మాత్రమే భక్తులు దర్శించుకునేందుకు అవకాశం ఉంది. కృష్ణానది ఆవలి వైపు సోమశిల ఆలయం ఉంది. పడవలో వెళ్లేందుకు అవకాశం ఉంది.

పుణ్యఫలం

సప్తనదుల సంగమేశ్వరుడిని దర్శిస్తే సమస్త పాపాలు తొలగి, కోటి జన్మల పుణ్య ఫలితం లభిస్తుందని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవాలి

ఆత్మకూరు మీదుగా 45 కి.మీ. దూరంలో ఈ క్షేత్రం ఉంది. నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు నుంచి కపిలేశ్వరం గ్రామం మీదుగా చేరుకోవచ్చు. ఏటా శివరాత్రి సమయంలో ఆర్టీసీ అధికారులు నందికొట్కూరు, ఆత్మకూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతారు.

ఓంకార క్షేత్రం



శ్రీ గంగా ఉమా సమేత శ్రీ ఓంకార సిద్ధేశ్వర స్వామి క్షేత్రానికి ఎంతో చరిత్ర ఉంది. ఓం అనే ప్రణవ నాథం ఈ క్షేత్రం నుంచే విశ్వవ్యాప్తం చెందినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. నంద్యాల ప్రాంతాన్ని పాలించిన నంద వంశ రాజులు ఆలయాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని తెలుస్తోంది.

దర్శన ఫలం

ఇక్కడ కోనేరులో స్నానం ఆచరించి ఓంకారేశ్వరస్వామిని దర్శిస్తే కోటి పుణ్యఫలాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. క్షేత్ర సమీపంలో బ్రహ్మలోకం, విష్ణులోకం, కైలాసం, పుణ్యక్షేత్రాలు నల్లమల కొండపై వెలిశాయి. ఈ క్షేత్రంలో కాశిరెడ్డినాయన నిత్యాన్నదానానికి ఎంతో పేరు ఉంది.

ఇలా చేరుకోవాలి

ఆత్మకూరు నుంచి 35 కి.మీ, నంద్యాల నుంచి 20 కి.మీ. దూరంలో ఈ క్షేత్రం ఉంది. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతారు. బండిఆత్మకూరు, నంద్యాల నుంచి ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.

రుద్రకోడు



నల్లమల అడవుల్లో వెలసిన పురాతన శైవ క్షేత్రాల్లో రుద్రకోడు ఒకటి. రుద్రాణి సమేతంగా రుద్రకోటీశ్వర స్వామి ఇక్కడ కొలువై ఉన్నారు. ఔషధీయుక్తమైన జలాలతో ఉన్న రుద్రగుండం కోనేరు విశిష్టమైనది. ఈ ఆలయంలో సీతారామస్వామి కూడా కొలువై ఉండడం విశేషం.

దర్శన ఫలం

రుద్రకోటేశ్వరస్వామిని దర్శించడం వలన కోటి జన్మల పుణ్యఫలం లభిస్తుంది. శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.

ఇలా చేరుకోవాలి

ఆత్మకూరు – నంద్యాల రహదారిలో నల్లకాల్వ గ్రామం నుంచి నల్లమల అడవుల్లో 12 కి.మీ. వెళ్తే ఈ క్షేత్రం చేరుకోవచ్చు. ఆత్మకూరు నుంచి 23 కిమీ దూరం, నంద్యాల నుంచి 40 కిమీ దూరంలో ఉంది. దారిలో గాలేరు, ముసళ్లవాగు వంటి కొండవాగులను దాటి వెళ్లాల్సి ఉంటుంది. దారిలో డాక్టర్ వైఎస్సార్ బయోడైవర్సిటీ పార్క్ ఉంది. అటవీ శాఖ అధికారుల అనుమతితో ప్రైవేటువాహనాల్లో చేరుకోవచ్చు.

'పది' విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ ప్రతాపరెడ్డి

ఆదోని అర్బన్: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణ సాధించేలా విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ప్రతాపరెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల హాలులో ఎంఈఓలు, హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన కథలు, జీవిత చరిత్రలను వివరించాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపి కనీసం 35 మార్కులు వచ్చేవిధంగా కృషి చేయాలన్నారు. ప్రతిరోజూ పాఠాలను చదివించి నోటుపుస్తకాల్లో రాయించేలా చూడాలన్నారు. రెండో విడత నాడు–నేడు పనులపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులతో పాటు ప్రతి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు, ఎంఈఓ, అధికారులు మధ్యాహ్న భోజనం తినాలన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కోసం జిల్లాల నుంచి అధికారులు వచ్చారన్న ఆరోపణలతో విద్యార్థి సంఘాల నాయకులు సమావేశ ప్రాంగణంలో ఆందోళన నిర్వహించారు. పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను స్టేషన్‌కు తరలించారు.

పోలీస్.. పనితీరు భేష్

- వేగంగా పలు కేసుల ఛేదన
- బాధితులకు అందిన సత్వర న్యాయం
- నేరస్తులకు శిక్షలు విధించిన న్యాయస్థానాలు
- పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న పోలీసు సిబ్బంది

కర్నూలు: చిన్న చోరీనే కావొచ్చు.. సంచలన రేపిన హత్యోదంతమూ అయి ఉండవచ్చు.. ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉండి ప్రయాణం ఇబ్బంది పెట్టవచ్చు.. ఇవే కాదు దైనందిన జీవితంలో స్వేచ్ఛగా విహరించడానికి ఎదురొచ్చే సమస్యలకు పోలీసులు పరిష్కారం చూపుతున్నారు. మేమున్నామని ప్రజలకు భరోసా ఇస్తున్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని కేసులను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం చేస్తున్నారు. నేరస్తులు తప్పించుకోకుండా సాక్ష్యాలను సేకరించి కోర్టుకు సమర్పిస్తున్నారు. ప్రతిభ కనబరిచిన పోలీసులను గురువారం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అభినందించారు.

జనవరి నెలలో పోలీసుల ప్రతిభ ఇదీ..

- పెద్దతుంబళం పీఎస్ పరిధిలో జరిగిన దొంగతనం కేసును 24 గంటల్లో పోలీసులు ఛేదించారు. కర్ణాటక రాష్ట్రం సిరిగుప్పకు వెళ్లి దొంగను అరెస్టు చేసి, అతని నుంచి రూ.1.20 లక్షలు సొమ్మును (ప్రాపర్టీ) రికవరీ చేశారు. కేసు దర్యాప్తులో కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్ ప్రతిభ కనబరిచారు.
- సాంకేతికతను ఉపయోగించి 289 సెల్‌ఫోన్లను, పెద్ద శక్తి గుడిలో నగలు దోచుకెళ్లిన వ్యక్తిని ఆదోని పోలీసులు అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు. అలాగే కర్ణాటక మద్యం నాటుసారా ఎక్సైజ్ కేసులలో 152 వాహనాలను సీజ్ చేశారు.
- కొత్తాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నదిచాగిలో జరిగిన ఫ్యాక్షన్ హత్య కేసును సాంకేతిక జోడించి 12 గంటల్లో ఛేదించారు. ప్రజలతో సంబంధాలు కొనసాగిస్తూనే లా అండ్ ఆర్డర్ నిర్వహణలో భాగంగా పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేశారు.
- పెద్దకడుబూరు పీఎస్ పరిధిలో జరిగిన జంట హత్యల కేసులో పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడంలో కానిస్టేబుల్ పెద్దయ్య కీలక పాత్ర పోషించారు. హత్య కేసులోని ముద్దాయి నాగరాజును సకాలంలో అరెస్టు చేశారు.
- చిప్పగిరి పీఎస్‌లో భాస్కర్ కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. యుఐ (అండర్ ఇన్వెస్టిగేషన్)లో 192 కేసుల్లో 185 పూర్తి చేశారు.
- కర్నూలు నాల్గవ పట్టణ పీఎస్ పరిధిలో జరిగిన హత్యాయత్నం కేసులో కూడా నిందితుడు (పీడీ యాక్ట్ ముద్దాయి) పఠాన్ ఇమ్రాన్ ఖాన్‌ను కడప సెంట్రల్ జైలు నుంచి తీసుకువచ్చి కానిస్టేబుల్ వెంకటరమణ కర్నూలు కోర్టులో ప్రవేశపెట్టారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమక్షంలో సరైన బ్రీఫింగ్ చేసి సాక్ష్యులను ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి నిందితునికి సంవత్సర కఠిన కారాగారశిక్షతో పాటు రూ.15 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా నెల రోజుల పాటు సాధారణ జైలు శిక్షను విధించాలని తీర్పు చెప్పారు.
- ఆదోని పట్టణంలో కీలకమైన ప్రదేశాలు, రద్దీగా ఉంటే ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఏఎస్‌ఐ లక్ష్మన్న చర్యలు తీసుకున్నారు.
- నేర నివారణే లక్ష్యంగా ఆదోని వన్‌టౌన్ పీఎస్ పరిధిలో వివిధ జంక్షన్లలో మొత్తం 52 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందుకు కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు చొరవ తీసుకున్నారు.
- జనవరి నెలలో విధుల పట్ల అంకితభావం, అత్యుత్తమ పనితీరు కనబరచిన ఏడుగురు సిబ్బందిని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ గురువారం ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో వారి ప్రతిభను గుర్తించి వీక్లీ బెస్ట్ ఫర్ఫార్మెన్స్‌కు ఎంపిక చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

పాములపాడు/బనగానపల్లె రూరల్: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గురువారం ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా ఖగ్గల్ గ్రామానికి చెందిన అడ్లిగ రమేష్ గౌడు(48) మిత్రులతో కలిసి వారం క్రితం పాదయాత్రగా శ్రీశైలం బయల్దేరాడు. బుధవారం రాత్రి పాములపాడు మండలం జూటూరు సమీపంలోని శివనాగ సాయి ఆశ్రయంలో నిద్రించారు. గురువారం తెల్లవారు జామున బళ్లారి జిల్లా మోకాకు చెందిన రామాంజి, ఆస్పరి మండలం చిన్న హోతూరు గ్రామానికి చెందిన పంపయ్యతో కలిసి నడక కొనసాగించాడు. రుద్రవరం గ్రామ సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ గౌడు అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రామాంజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామేశ్వర్ తెలిపారు.

దేవరకు బంధువులను పిలిచేందుకు వెళ్లి

బంధువులను ఆహ్వానించి ఘనంగా దేవర నిర్వహించాలనుకుంటున్న ఆ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. బనగానపల్లె మండలం చిన్నరాజుపాళెం గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బనగానపల్లెలోని భానుముక్కల తెలుగుపేటకు చెందిన రాముడు కుమారుడు వడ్డె మనోహర్(17), బంధువు సుబ్బయ్యతో కలిసి ఈ నెల 21, 22న జరిగే దేవర నిమిత్తం పెద్దరాజుపాళెం, చిన్నరాజుపాళెం గ్రామాల్లోని బంధువులను ఆహ్వానించేందుకు ఉదయం బైక్‌పై బయలుదేరాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా చిన్నరాజుపాళెం గ్రామ సమీపంలో ఉన్న వంతెన వద్దకు రాగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మనోహర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన సుబ్బయ్యను స్థానికులు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వెల్లివిరిసిన మత సామరస్యం



శివస్వాములకు భిక్ష వడ్డిస్తున్న ముస్లిం సోదరుడు

జలకనూరు గ్రామంలో శివదీక్ష చేపట్టిన శివస్వాములకు గ్రామానికి చెందిన ముస్లిం వ్యక్తి పాశమియ్య గురువారం భిక్ష ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని చాటారు. శివ స్వాములు భిక్ష స్వీకరించి దాతను ఆశీర్వదించారు. – మిడుతూరు

APSRTC
టెండరు ప్రకటన
https://apsrtc.ap.gov.in tenders APSRTC
సం. C3/437(41)/2023-DPTO/KNL, తే: 13-02-2023

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

పోలీస్/ఆర్మీ /ఉద్యోగాలు

■ ఆర్మీ (అగ్నివీర్) ఉద్యోగాలు ఆన్‌లైన్ ప్రారంభమైనది. అ:10th పాస్, వ: 18-21 వ్రాత పరీక్ష పోలీస్ / PET / మెయిన్ స్టార్ కోచింగ్ సెంటర్, నంద్యాల. సెల్ :87908 44959. [L-794328]

REAL ESTATE

■ భార్గవ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, కర్నూలు. 3BHK,2BHK ఫ్లాట్స్ & ఇండిపెండెంట్ హౌసెస్, ఇన్వెస్ట్‌మెంట్ కొరకు కుడ అప్రూవల్‌తో తక్కువ ధరలో రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్లు కలవు. సెల్ : 91828 21014 Srinevas. [L-794327]

PLOT FOR SALE

■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్కు ప్రక్కన 30×40 (2.75 సెంట్లు) ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సెంటు 1.10 లక్ష మాత్రమే. సంప్ర: నితిక డెవలపర్స్ 96118 10669 [L-794322]

■ భాష్యం న్యూHMDA వెంచర్ @కొత్తూరు బెంగుళూరు హైవే 1 K.M అన్ని డె॥ క్లబ్ హౌస్, స్విమ్మింగ్‌పూల్ 50% బ్యాంక్ లోన్‌తో ప్లాట్లు కలవు. Ph: 9951329192 [HA-742]

SERVICES

■ హౌస్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యక్తిగత, వ్యవసాయ భూములపై అతి తక్కువ వడ్డీతో ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. ✆ 9988199941. [T-1752]

HEALTH CARE

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-971]

WANTED

■ మా TR ACTING ఇన్‌స్టిట్యూట్, పద్మావతినగర్, నంద్యాలలో పనిచేయుటకు లేడీ డాన్స్ మాస్టర్ కావలెను. అనుభవం బట్టి జీతం. లాస్ట్ డేట్ 18-02-23, 88855 58953, 94916 39412 [L-794431]

■ శ్రీ సంతోష్ పాలిమర్స్, కల్లూరు ఎస్టేట్ కర్నూలు నందు పనిచేయుటకు సేల్స్‌మెన్స్ & లేడీ టెలికాలర్స్ కావలెను. సంప్ర: 90822 22730, 72077 74434 [L-794324]

■ Wanted Well Qualified Lady Telecallers in Kurnool with Good Communication Skills. Experienced / Freshers. Sal : 15,000/- Cell : 090940 62440 [L-794434]

■ ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు రిసెప్షనిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్ (M/F) కావలెను. Qly : Any డిగ్రీ, జీతం : 15 నుండి 20 వేలు, సంప్ర వేళలు : 10 A.M. to 1 P.M Cell : 75502 05558 [L-794440]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781829]

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉంటూ పార్ట్ టైమ్/ఒక గంట చేతివ్రాత ద్వారా పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్. 7702473949 [G-781823]

■ Dhone, మెయిన్ సర్కిల్ నందు పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ Male అర్జెంట్‌గా కావలెను. EPF & ESIC సదుపాయం కలదు. సెల్: 9848524061. [A-415]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 63500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190572]

■ ఆకాశ ఎయిర్‌లైన్స్‌లో వర్క్ చేయుటకు ఎయిర్ క్యాబిన్ సూపర్‌వైజర్స్, టీం లీడర్స్, సూపర్‌వైజర్స్, కస్టమర్ కేర్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్ వైజర్స్ కావలెను. Qly 10th-డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, జీతం: 23,000/- to 29,000/- రూం + ఫుడ్ ఫ్రీ. వ: 18-35 సం॥. ✆ 88850 39153 [B-762872]

■ ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ & కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం+ఇన్సెంటివ్స్. సంప్ర: బిర్లా కాంపౌండ్, కర్నూలు. 90308 20894 [L-794323]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/ పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp, Dr, Q.5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd, Ph: 7995374999 [HA-998]

■ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 12,000/- ఉచిత వసతి, ఉచిత భోజనం Ph: 6300661014 [HA-922]

■ విజయహోంకేర్ HYDలో పెద్దవారికి సేవ చేయుటకు, బేబి కేర్, పేషెంట్ కేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు, కావలెను. జీ: 16000-25000 (ఏజెంట్ కమీషన్ కలదు),రూం+మీల్స్ ఫ్రీ. 9491367222. [H-793511]

■ WALK IN INTERVIEW- Medical Representative Qualification : Any Graduation or D.Pharmacy 8919730457 [H-796710]

■ స్టార్ హోమ్ కేర్ Hyd. లో వృద్ధులకు, పేషంట్లకు సేవ చేయుటకు, బేబికేర్, ఇంటి / వంట పని స్త్రీ / పు, లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం : 16,000/- నుండి 25,000/- రూం + భో. ఫ్రీ. ఫోన్: 78010 99881, 86398 28228 [V-775156]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.